# 'గోమాత'

– మైనాస్వామి

**వేరుశెనగ పెట్టి రెన్నెళ్లయింది. ఇంతవరకు వాన రాలేదు. విత్తనాలు వేసేటప్పుడు పడిన కొద్దిపాటి వాన తప్ప... మళ్ళీ వరుణుడు కరుణించ లేదు. చెట్టు ఎదగక పోగా వున్న పూత రాలిపోతోంది.**

నాగన్న ఆకాశం కల్ల చూస్తున్నాడు. అతని చూపు లలో ఆశ స్పష్టంగా కనిపిస్తున్నది. ఇంటి ముందు పడుకున్న నాగన్నకు నిద్రపట్టలా. అటు ఇటు మసుగు తున్నాడు. ఏమయ్యో! అంది భార్య నారమ్మ ఏమి? అని తల తిప్పి అన్నాడు.

''ఇంట్లో సరకు లేమీ లేవు. ఇంకా అడగడానికి ఎవరి ఇండ్లూ మిగల్లేదు. యాడికైనా పోయి అప్పు తీసుకురా అంది నారమ్మ,

''ఇప్పటికే లెక్కకు మించిన అప్పులు చేశాను. ఈ వానొస్తుందా? పంట పండుతుందా? అప్పులు తీరు తాయా? ఆ ఆవుదూడనమ్మి సరకులు తెస్తాను' అన్నాడు. ఆవు దూడనమ్మడానికి నారమ్మకు బొత్తిగా ఇష్టం లేదు. కానీ పస్తులతో కాలం గడపలేక ఇద్దరు పిల్లలను చంపుకోలేక ఆవుదూడనమ్మడానికి ఒప్పుకుంది.

పంట పెట్టే ముందు ఆవునమ్మారు. మళ్ళీ రెన్నె ల్లకే దూడ నమ్మాల్సి వస్తుందని వారూహించలేదు. నారమ్మకు కొడుకు లిద్దరే అయినా ఆవు దూడను మూడో కొడుకుగా చూసుకుంటుంది. ఎంతో గారా బంగా పెంచుకున్నది. ఆవు దూడను సంతకు తోలు కొని పోయే ముందు పూజ చేసింది.

ఆవు దూడ అలా వెళ్ళిందో లేదో గానీ నారమ్మ భోరున విలపించసాగింది. ఇంట్లో వున్న ఇద్దరు పిల్లలు నారమ్మ కల్ల అట్లే చూస్తున్నారు. అమ్మతో పాటు వారు కూడా ఏడవ సాగారు. తన కొడుకులను గుండె లకు హత్తుకుని ఏడుస్తోంది. అమ్మ ఎందుకు ఏడుస్తు న్నదీ పిల్లలకు అర్థం కాలేదు. దిక్కు తెలీక అమ్మ దుఃఖంలో వారు కూడా పాలు పంచుకున్నారు. కొన్ని గంటలు అట్లే వున్నారు.

నారమ్మ 'రాయలో'ల్లింటికి పనికి పోతుంది. ఆ రోజు బాగా ఆలస్యమయింది. కొట్టంలోని ఆవులను బయట కట్టేసింది. వేరుశెనగ పిండి కలుపుతోంది. అంతలో ఆవు దూడ ''అంబా! అంబా!'' అంటూ పరుగెత్తుకుని వచ్చింది. దూడ నోట్లోకి సెనగపిండి ముద్ద పెట్టింది. ఆవు దూడను పట్టుకుని విలపించ సాగింది. తన ముద్దుల మూడో కొడుకుని అమ్ముకుం టినే అని మధన పడుతోంది. తన బాధను ఎవరికీ చెప్పక, చెప్పకోలేక మనసులోనే కుమిలి పోతోంది.

ఒక్కసారిగా తన మనసు సంత వైపు మళ్ళింది. తన దూడను ఈ పాటికి అమ్మేసుంటారనుకుంటూ ఊహల్లో తేలిపోయింది.

ఆదొక పెద్ద సంత. ఆ సంత రాష్ట్రంలోనే రెండ వదిగా పేరు గాంచింది. ప్రతి వారం ఆ సంత నుంచి దాదాపు నాలుగు వేల పశువులు కబేళాలకు తరలిపో తుంటాయి. వారం-వారం దాదాపు ఏడెనిమిది వేల పశువులు సంతలో కలుస్తుంటాయి. గడ్డి లేక వాటిని మేపడానికి చేతగాక కొంతమంది అమ్మితేవారికే పూట గడవక మరి కొంత మంది అమ్ముతుంటారు. ఎలాగయి తేనేం మొత్తం మీద ప్రతివారం ఈ సంత నుంచి నాలుగు వేల పశువులను కటిక కత్తికి బలి చేస్తుంటారు.

గో హత్య మహాపాతకమన్నారు... ఆనాడు. మరి ఈనాడు... దానినే నిత్యకృత్యంగా పెట్టుకొని జీవిస్తు న్నారు. మళ్ళీ దూడ అరిచే సరికి నారమ్మ ఊహలకి అంతరాయం కలిగింది. 'తన దూడ కూడా కటికె కత్తికి బలి కావలసిందేనా...' అనుకుంటూ ఏడ్వ సాగింది.

పది గంటలవుతోంది. అమ్మ ఇంటికి రాగానే కొడుకులిద్దరూ పరిగెత్తుకెళ్ళారు. కొంగు చాటున వుంచుకున్న సద్దన్నపు గిన్నె వారికిచ్చేసి ఓ మూల కూలబడింది...

ఆమె మనసంతా సంత చుట్టూ తిరుగుతోంది. తన దూడ కళ్ళల్లో మెదులుతోంది. వేరే ధ్యాసే లేదు. ఆ దూడ వుండి తను చచ్చినా ఫరవాలేదనుకుంది. కానీ ఆ అవకాశం తనకు రాలేదే అని బాధపడింది. మూలన కూర్చున్న నారమ్మ ఏడుస్తూనే వుంది.

అంతలో సంచి నిండా సరకులతో నాగన్న సంత నుంచి తిరిగొచ్చాడు.

''బాగా ఆకలయితా వుంది. అన్నం వండు'' అన్నాడు. వెంటనే అన్నీ విప్పి కుండలలో పోసుకుంది. బియ్యపు నూకలు చాటలో చెరుగుతోంది. ఆ బియ్యపు నూకల్లో ఆవు దూడ కనిపిస్తున్నది. ఆమె నూకలు చెరుగుతుంటే ఒక్కొక్క చుక్కే కన్నీరు నూకల్లో పడుతున్నాయి...



పళ్ళెం (తట్ట)లో అన్నం పెట్టింది. బాగా ఆకలవు తోంది కాబట్టి నాగన్న గబ గబా తింటున్నాడు. భర్త వైపు తదేకంగా చూస్తోంది...

తన మనసంతా దూడపైనే... తన ఆవు దూడను భర్త చంపుతున్నట్టుంది ఆమెకు.

భర్త పళ్ళెం వైపు చూసింది. ఆవు దూడను కత్తులతో కోస్తున్నట్టు కనిపిస్తోంది.

ఆ పళ్ళెంలో మాంసం ముద్దలు కనిపిస్తున్నాయి.

ఆ మాంసం ముక్కలను తన భర్త తింటున్నాడను కుంది. ఒక్కసారిగా భర్త పక్క నున్న చారు గిన్నె వైపు చూసింది. అందులో రక్తం కనిపించింది. ఇది తన దూడ రక్తమే అనుకుంది.

మనసులోనే మధన పడుతున్న నారమ్మ ఒక్క సారిగా కుప్పకూలిపోయింది. నారమ్మ తన ఇద్దరి బిడ్డలకే తల్లికాదు. ఆవు దూడకు కూడా తల్లి నారమ్మే.

అందుకే.. ఆమె... గోమాత.